# గోమాలచ్చిమి

రచన:
శ్రీ బెహరా ఉమామహేశ్వరరావు

"మామా!...ఓ రామయ్య మామా!"

"ఒసే ఏట్రా ఆ గాబరా?"

"అదే మామా!"

"అదేందో సెప్పరా?!!"

"సూడు మామా! నీ దగ్గర......"

"ఏట్రా ఆ బిడియం. ఆ సెప్పేదేదో సరిగా సెప్పరా?"

"అదే మామా! నీ దగ్గర పదిగొడ్లు ఉన్నాయటగా?"

"అయితే!"

"అందులో నాలుగు ముసలిగొడ్లు ఇస్తే..."

"ఇస్తే?"

"తగిన రేటు ఇస్తాలే మామా!"

ఎందుకు? ఆకమేలాకేనా?"

"ఆహా! ఎంత బేగి పోల్చీసావు, మామా!"

"ఛీ! ఛీ! అదేం పనిరా, జామేసు?"

"చూడు మామా, నీవా, ముసలి అయిపోతున్నావు, ఆ ముసలి పశువుల్ని వదిలించుకోడానికి ముందు సూడు. కాలమా ఏమీ బాగు లేదు. గొడ్డుల్ని పెంచడం మా పెద్ద బరువు అయిపోతుంది గదా! అంచేత నీకు నాలుగు డబ్బులూ వస్తాయి, నానా, నాలుగు కాసులు తింటాను."

"ఒరేయ్, జామేసు! నీకు ఒకమాట సెబుతాను వింటావురా?"

"ఒకటేమిటి మామా? వంద......వంద సెప్పు!"

"నన్ను మీ అత్తను ఆకమేలాకి తోలుకుపోరా!"

"అదేటి మామా! అలాటి మాటలు యికటాలకైనా అలాంటి మాటలు ఆడబోకా!"

"కాకపోతే మరేట్రా! నేను మీ అత్తా ముసలై పోయినాం గదా, ఆకమేలాకు తీసుకుపో, అసలు నీకు తెలుసో లేదో, నర మాంసం మా గొప్ప రుచట్రా! అందుకే నర మాంసం తిన నేర్చిన పులి మరేమాంసం ముట్టుకోదట?"

"అయితే?!!"

"అదేరా, ఆ నోరులేని పశువులు వట్టిపోయినాయని కమేలాకట్రా! ఛీ! ఛీ! నీకు బుద్ధి లేదు. రక్తమాంసాలు ఉన్నన్నాళ్లు అవి మనకు పాలిచ్చాయిరా! ఇప్పుడు ఆటిని కమేలాకిరా తోలుతావు? నువ్వేం మనిసివిరా?"

"చూడు రామయ్య మామా! నీ కిట్టమైతే ఇయ్యి, నీ కష్టమైతే లేదు. అంతేగాని, అదేటి అలాటి మాటలు. నేనేం రాచ్చసుడినా?"

"ఛీ! ఛీ! నువ్వు నిజంగా రాచ్చసుడివే! ఫో ఫో నీ ముఖం నాకు సూపించబోక."

* * *

రామయ్య బీద కుంటుబీకుడే! పాలేరు తనం చేసేవాడు. భార్య సీతమ్మ కూలీ నాలీ చేసేది. ఇద్దరు కొడుకులు. కష్టం చేస్తునే ఇద్దరు కొడుకుల్ని చదివించాడు. పెద్దవాడు, వైజాగ్ బి. హెచ్. పి. వి. లో ఉద్యోగం. వాడికి పెళ్ళి చేసాడు. ఇద్దరు పిల్లలు కూడా. అయినా తల్లీ దండ్రికి రెండు వందలు పంపుతున్నాడు. తమ్ముడిని కూడా తీసుకు పోయాడు. రామయ్యకు రెండో కొడుకు మూడువందలు పంపుతున్నాడు. ఇంకా పెళ్ళి కాలేదు. ఇద్దరు కొడుకులు తల్లీ తండ్రిని వచ్చేయమని ఎన్నిసార్లు చెప్పినా, వారు వినలేదు. ఆ పల్లె వాతావరణం నుండి బస్తీకి పోవడం వారికి సుతారాం ఇష్టం లేదు.

పది వరకు పశువులు పెంచుతున్నాడు రామయ్య. అవి ఇచ్చే పాలు తక్కువే. అయినా

కాలక్షేపానికి పెంచుతున్నాడు. అవి యిచ్చే పాలు ఊరిలో అమ్మిన ఆ డబ్బులు వాటి మేతకే చాలవు. కొడుకులు అర్జున గాండీవంలా ఉంటే వారి బ్రతుక్కి భయం లేదు.

• • •

రోజులు మారాయి. చుట్టు ప్రక్కల బీళ్ళు పట్టాలు అయ్యాయి. వరకట్టడం ప్రారంభించారు. చివరికి శ్మసానం కూడ దున్నడం ప్రారంభించారు. మనిషిలో స్వార్థం పెరిగింది. నోరున్న వాడిదే రాజ్యం. నోరులేని పశువులను చూసే నాథుడు లేదు. నిల్చోడానికి కూడా పశువులికి చోటు లేదు. మేత లేక పశువులు బక్కచిక్కాయి. కామందుగారి పొలంలో పడితే చావ బాదారు. ఆ దెబ్బలు చూసిన రామయ్యకు కళ్ళు తిరిగాయి. ప్రెసిడెంటుగారి పొలంలో పడితే బంధిఖానాలో ఉంచి ఆ మూగజీవాల్ని మేత లేకుండా మల మల మాడ్చారు. జరీమానా కట్టి రామయ్య వాటిని విడిపించాడు. అవి ఇచ్చే పాల అంతంత మాత్రం, పల్లెల్లో కూడా పాల డబ్బాలు దర్శనం. ఇంకా రామయ్య ఇంటి పాలు ఎవరికి అవసరం? వృద్ధుడైన రామయ్యకు ఆ పశువుల పెంపకం భారమైంది. వాటిని నిత్యం తిండి తిప్పలి లేకుండా చంపడం కంటే ఒకేసారి చంపడం నయం అనిపించింది. ప్రెసిడెంటుగారి పెసర చేనులో పడిన ముసలిగొడ్డును చావబాదారు. అది నడవలేక నడవలేక ఇంటికి చేరింది. దాన్ని చూసిన రామయ్యకు కళ్ళవెంట రక్తం కారింది. ఇంకా లాభం లేదు. అనుకున్నాడు. జామేసు దగ్గరకు స్వయముగా వెళ్ళడానికి రామయ్యకు ముఖం చెల్ల లేదు. కబురు చేయక తప్పలేదు.

కబురు అందిన వెంటనే జామేసు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

రామయ్య భోరుమంటూ, "అమ్మా, గోమాలచ్చిమిలు! పాపాత్ముడిని, పెంచలేక సంపుకు తింటున్నాను. నేను రాచ్చసుడిని. తల్లులు, మా తల్లులు" అంటూ ఊరంతా దద్దరిల్లేటట్లు ఏడువసాగాడు.

"సూడు మామా! నీకు ముందే సెప్పానా? ఆటిని రోజూ సంపడంకంటే ఇదే నయం ఏడవక" అంటూ జామేసు పది పచ్చనోట్లు రామయ్య చేతిలో పడేసాడు.




మనుమడు: తాతా! ఆవు చాలా మంచిది కదూ!

తాత: అవును బాబూ! ఆవు చాలా మంచిది; సాధువు కూడా!